క్లుప్తంగా

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



శక్తి యాప్‌పై సమీక్షిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: శక్తి యాప్‌ను మహిళలతో డౌన్‌లోడ్ చేయించి, ఆపద సమయంలో వారికి తక్షణ సహాయం అందించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. శక్తి యాప్ డౌన్‌లోడ్, ఇన్‌స్టలేషన్, ఫీచర్లపై పోలీసు కార్యాలయంలో జిల్లా టెక్నికల్ టీమ్‌తో గురువారం ఆయన సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ గూగుల్ ప్లే స్టోర్ నుంచి మహిళలు, బాలికలు తమ ఫోన్‌లోకి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే.. వారు ఉన్న లొకేషన్ వివరాలు దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112 కాల్ సెంటర్‌కు చేరతాయన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు.

రేపటి నుంచి సాయి మందిర వార్షికోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణాన్ని ఆనుకుని ఉన్న షిర్డిసాయి మందిర 13వ వార్షికోత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. అద్దంకి వెంకట ప్రభాకర రామచంద్రరావు నిర్వాహణలో ఈ నెల 15, 16, 17 తేదీలలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహిస్తారు. మైలవరపు నారాయణ (ద్రాక్షారామ) బ్రహ్మత్వంలో, దెందులూరి శ్యామ్ కుమార్ అర్చకత్వంలో ఈ మూడు రోజులు విశేష కార్యక్రమాలు జరుగుతాయి.

చిర్రావూరి మృతి తీరని లోటు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న విశ్వనాథ గోపాలకృష్ణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహోపాధ్యాయ చిర్రావూరి శ్రీరామశర్మ మరణం సాహిత్య లోకానికి తీరని లోటని పలువురు అన్నారు. శృంగేరిలో కుమారుని ఇంట ఈనెల 4న తుదిశ్వాస విడిచిన శ్రీరామశర్మ సంస్మరణ సభను లలితా నగర్‌లోని రాజసౌధ అపార్ట్‌మెంట్స్ దగ్గర అపార్ట్‌మెంట్ వాసుల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, మహామహోపాధ్యాయ కొంపెల్ల సత్యనారాయణ, భారతాత్మ పురస్కార గ్రహీత గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి మాట్లాడుతూ శ్రీరామశర్మతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒక్క రోజు జాతీయ సదస్సులో ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విద్యార్థులు అద్భుత ప్రతిభను కనపరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. ఎం. తోష అనే విద్యార్థిని సింధూ నాగరికత పరిపాలనలో మతం పాత్ర పరిశోధన పత్రంపై వివరణ ఇచ్చిందన్నారు. సీహెచ్.అఖిల, నూర్జహాన్, జె.రమేష్, కె.వాణి, సూర్యచంద్ర, కె.సంధ్య, లావణ్య, వి.ప్రవల్లిక భారత పరిపాలనాచరిత్ర లోని వివిధ అంశాలపై పోస్టర్ ప్రెసెంటేషన్ ప్రతిభవంతంగా చేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. వీటిలో నూర్జహాన్‌కు ప్రథమ స్థానం, నగదు బహుమతి లభించాయన్నారు. సదస్సులో రాజనీతిశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ బాబ్జీ, డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, కేపీబీఎల్ సరోజ, రామారావు, రామకృష్ణ, తులసి కుమారి పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూజలు



జీయర్ స్వామికి వేంకటేశ్వరుని చిత్రపటం అందజేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి, తన శిష్యబృందంతో గురువారం సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఆలయంలో జరిగే కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వరహస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలను పరిశీలించారు. అనంతరం కమిటీతో మాట్లాడుతూ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలోని కమిటీ సభ్యులు నల్లమల్లి రామచంద్రారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదలరా..

- మద్యం మత్తులో అనేక ప్రమాదాలు
- పలువురి మృత్యువాత, కొందరికి తీవ్ర గాయాలు
- నగరంలోనే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- హైవేలపై అంతంత మాత్రమే

కంబాలచెరువు: మద్యం మత్తు అనేక కుటుంబాలను చిత్తు చేస్తోంది. అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమై పలువురిని రోడ్డు మీద పడేస్తోంది. ఫుల్‌గా మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్న వారు కొందరైతే, తాగిన మత్తులో వాహనం నడుపుతూ వేరొకరిని ఢీకొని, వారి మరణానికి కారకులవుతున్నవారు ఇంకొందరు. కొన్ని ప్రమాదాల్లో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులు గాయాలతో బయటపడుతుంటే, ఏ తప్పు చేయని పాదచారులు బలైపోతున్నారు.

● నరేష్, రమేష్‌లు రైల్వే సైట్ ఇంజినీర్లు. ఒకరిది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, మరొకరిది గుంటూరు. వీరిద్దరు పని నిమిత్తం ఆటో నగర్ వెళ్లి తిరిగి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మోరంపూడి ఫ్లైఓవర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఆ సమయంలో వేగంగా కంట్రోల్ తప్పిన కారు వచ్చి వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో వారు ఎగిరి పడి రోడ్డుపై పడ్డారు. ఈ సంఘటనలో మూడు పదులు నిండని నరేష్ అక్కడికక్కడే మరణించాడు. రమేష్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

● నాయుడు, వెంకీ, బలరామ్, నాగు స్నేహితులు. వీరు ఉద్యోగాలు, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్నారు. రోజు మాదిరిగానే ఫోన్‌లో మాట్లాడుకుని రాత్రి సమయంలో కలిశారు. కలిసిందే తడవుగా మద్యం తాగారు. అర్ధరాత్రి తర్వాత ఇంటికి బయలుదేరారు. మద్యం తాగి కారు నడుపుతుండడంతో కంట్రోల్ తప్పారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని ఢీకొట్టి మరింత వేగంగా వెళ్లిపోయారు. ఈ సంఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న ఇద్దరూ మృతి చెందారు. దీంతో కంగారు పడిన కారులోని వ్యక్తులు మరింత వేగంగా నడిపి ఊరి శివారులో మరో వాహనాన్ని ఢీకొట్టారు. కట్ చేస్తే మద్యం మత్తు రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మరో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారిని ఆస్పత్రి పాలు చేసింది. వెరసి నాలుగు కుటుంబాలు రోడ్డున పడేలా చేసింది.

నిత్యం తనిఖీలు

మద్యం తాగి వాహనం నడుపుతున్న వాహన చోదకులకు నగర పరిధిలో పోలీసులు తనిఖీలు చేస్తుంటారు. వారు పట్టుబడితే జరిమానాలు విధించి కేసులు రాస్తుంటారు. ఇలా ఇటీవల కొందరిని జైలుకు పంపించారు. అయితే ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నగరం లోపల వరకూ మాత్రమే పరిమితమవుతున్నాయి. జాతీయ రహదారిపై కూడా చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. ద్విచక్ర వాహన చోదకులతో పాటు కార్లు, లారీలు, ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లను తనిఖీ చేయాలి. అయితే పోలీసులు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించినట్లు, హైవేలపై చేయలేకపోతున్నారు. దీనికి సిబ్బంది తక్కువ కారణమా, మరే ఇతర కారణాలా అనేది తెలియాలి. హైవేలపై వారంలో రెండు, మూడు సార్లు మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన రమేష్ (ఫైల్)



మోరంపూడి ఫ్లైఓవర్‌పై ద్విచక్ర వాహన చోదకులను ఢీకొట్టిన కారు (ఫైల్)

కేసుల నమోదు

నగరంతో పాటు హైవేలపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. గూడ్స్ క్యారియర్ వ్యాన్లు, లారీలు, ద్విచక్ర వాహనదారులు అధికంగా ఈ తనిఖీల్లో దొరుకుతున్నారు. వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. నగరం బయట ప్రాంతాలైన లాలాచెరువు, మోరంపూడి, ఇతర జీరోపాయింట్‌లలో తనిఖీలు చేస్తున్నాం. ఇటీవల రెండు టూరిస్టు, ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సుపై కేసు నమోదు చేశాం.

– మహ్మద్ నబీ, ట్రాఫిక్ సీఐ, రాజమహేంద్రవరం

పారదర్శకంగా కౌన్సెలింగ్



జోనల్ రీజనల్ డైరెక్టర్ పద్మా శశిధర్‌ను కలిసిన అసోసియేషన్ మహిళా నేతలు

కంబాలచెరువు: వైద్య ఆరోగ్యశాఖ రాజమండ్రి జోనల్ పరిధిలో హెల్త్ సూపర్ వైజర్ నుంచి పబ్లిక్ హెల్త్ నర్సు (పీహెచ్‌ఎన్) పదోన్నతుల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించినట్టు జోనల్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మా శశిధర్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన మెడికల్ అండ్ హెల్త్ ఫిమేల్ సూపర్ వైజర్లకు స్థానిక ఆర్డీ కార్యాలయంలో ప్రశాంతంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. జోనల్ పరిధిలో 71 మందికి పీహెచ్‌ఎన్‌లగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చామన్నారు.

డాక్టర్ పద్మా శశిధర్‌కు అభినందనలు

కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించిన జోనల్ ఆర్డీ డాక్టర్ పద్మా శశిధర్, డిప్యూటీ డైరెక్టర్ సురేష్ కుమార్‌లను ఏపీ ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళానేతలు అభినందించారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీకేఎన్ జయలక్ష్మి, ఏలూరు జిల్లా అధ్యక్షులు కె.నాగమణి, ట్రెజరర్ మరియమ్మ, రాజమండ్రి జిల్లా ప్రెసిడెంట్ విజయభాను, కార్యదర్శి నాగమణి అభినందనలు తెలియజేశారు.

అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు



కవయిత్రి సునీతను సత్కరిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగు కవిత్వంలో స్త్రీకి తగిన గౌరవం ఇచ్చి, కథానాయికలను సాధారణ యువతులుగా చిత్రీకరించిన అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు సుబ్బారావు అని ప్రసిద్ధ కవియిత్రి కండెపు సునీత అన్నారు. స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో గురువారం ఆంధ్ర మహిళా సభ, సంహిత డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ×తెలుగు కవుల రచనలలో స్త్రీ పాత్ర¤ అనే సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ రాయప్రోలు గొప్ప జాతీయవాది అని కొనియాడారు. సంహిత కళాశాల వ్యవస్థాపకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సాధారణ స్త్రీకి దేవతా స్థానాన్ని ఇచ్చి అద్భుతమైన రచనలు చేసిన తొలి వ్యక్తి రాయప్రోలు అన్నారు. కార్యక్రమంలో జి.నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, తెలుగు అధ్యాపకులు పి.జయరాజ్, హర్షిత అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా హరిహరనాథ సభ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హరిహరుల నడుమ భేదం లేదని, వారు అద్వైత మూర్తులని మహాకవులు తీర్మానించారు. త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి 74వ సంగీత వార్షికోత్సవాల్లో భాగంగా లబ్ధప్రతిష్టులైన కవులు గురువారం హరిహరనాథ సభను రసవత్తరం చేశారు. ప్రముఖ కవులు తిక్కన సోమయాజి, శ్రీనాథుడు, పోతన, ధూర్జటి, వాగ్గేయకారుడు త్యాగయ్య హాజరయ్యారు. ముందుగా తిక్కన సోమయాజి హరిహరనాథుని కీర్తిస్తూ పద్యంతో సభకు శ్రీకారం చుట్టారు. మహాకవి శ్రీనాథుడు సర్పహారాలతో, జటాజూటాలతో త్రినేత్రుడు ప్రత్యక్షం కావాలని పద్య రూపంలో కోరారు.



హరిహరనాథ సభ నిర్వహిస్తున్న కవులు

'మిమ్మల్ని కాపాడటానికి పరమేశ్వరుడు విషం కక్కలేక, మింగలేక కంఠంలో దాచుకున్నాడ'ని మల్లాప్రగడ చమత్కరించారు. 'వాలిన భక్తి మ్రొక్కెద..' పద్యాన్ని సహజ కవి పోతన ఆలపించారు 'శివుడవో, మాధవుడవో' అనే కీర్తనను త్యాగయ్య ఆలపించి శివకేశవుల పట్ల తమ భక్తిప్రపత్తులు చాటుకున్నాడు. ముక్కంటిని కీర్తిస్తూ ధూర్జటి పద్యాన్ని వినిపించారు. శివకేశవులు అభేదమూర్తులని తిక్కన సోమయాజి పేర్కొంటూ, 'శ్రీయన గౌరి నాబరగు..' పద్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తిక్కన సోమయాజిగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, శ్రీనాథుడిగా తాతా సూర్య రమా సందీప్‌శర్మ, ధూర్జటిగా రాంభట్ల పార్వతీశ్వరశర్మ, పోతనగా నోరి నారాయణమూర్తి, త్యాగయ్యగా ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి ప్రేక్షకులను అలరించారు. సాహితీమూర్తులను నిర్వాహకులు సత్కరించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల వనవిహారం



వన విహారంలో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులు

కడియం: జిల్లా పీఎం శ్రీ పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ నాలుగో రోజు శిక్షణ తరగతులను పురస్కరించుకుని ఏఎల్‌టీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం వనవిహారం చేశారు. అంతకు ముందు సర్వమత ప్రార్థనలు జరిగాయి. మినర్వా విద్యా సంస్థల సహకారంతో నాలుగు బస్సుల్లో 160 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు స్థానిక పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. అక్కడ మొక్కలను పరిశీలించి, నర్సరీ సాగు వివరాలను నమోదు చేసుకున్నారు. క్యాంపు ఇన్‌చార్జి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కేంప్ ఫైర్, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, గైడ్ ఉపాధ్యాయులు ఫణి మాధవి, గిరిజ, కల్పన, జ్యోతి పాల్గొన్నారు. క్యాంపును ఏఎంఓ గౌరీ శంకర్, సీఎంవో శ్రీనివాస్ సందర్శించి, పలు సూచనలు చేశారు.

జాతరోత్సవం.. వైభవోపేతం

- ముగిసిన పాత సోమాలమ్మ జాతర
- భారీగా తరలివచ్చిన భక్తులు



పాత సోమాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం గ్రామదేవత పాత సోమాలమ్మ అమ్మవారి జాతరోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించి, అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గరగ నృత్యాలు, వివిధ వేషధారణలు, డప్పువాయిద్యాలు, బాణసంచాల కాల్పుల మధ్య నగరంలో ఊరేగించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితర నేతలు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.



కాంతారా వేషధారణ



ఆంజనేయస్వామిగా..



శివుడి వేషధారణలో..

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగులు



బొమ్మూరులో వైఎస్సార్ విగ్రహం



బొమ్మూరు రాఘవేంద్రనగర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం



ధవళేశ్వరం మెయిన్‌రోడ్డులో..

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిపోయింది. కానీ రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను మాత్రం అధికారులు ఇంకా తొలగించలేదు. ధవళేశ్వరం, బొమ్మూరు గ్రామాల్లో వైఎస్సార్, ఎన్‌టీఆర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు ఎన్నికల సమయంలో ముసుగులు కప్పారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ వద్ద..

ఘనంగా ఎస్‌కేఆర్ మహిళా కళాశాల వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మంగతాయారు

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లయన్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజర్ మాటూరి మంగతాయారు, క్రీడా విభాగం నుంచి పి.శ్రీలక్ష్మి హాజరయ్యారు. విద్య, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగతాయారు మాట్లాడుతూ విద్యార్థులు తమ అధ్యాపకులను గౌరవించాలని, కళాశాలలో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. పి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి సత్కరించారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన బోటనీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ ఎం.శ్రీదేవిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్, కో ఆర్డినేటర్ సునీత, అకడమిక్ కో ఆర్డినేటర్ పి.శ్రీవల్లి పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహాసభలు



ముగింపు సభలో మాట్లాడుతున్న షారోన్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ 58వ మహాసభలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు లండన్‌కు చెందిన రెవరెండ్ సలోమి సుకేష్ మొదటి సందేశం అందించారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆర్‌జీ ఇమ్మానుయేలు రాజు రెండో సందేశమిచ్చారు. మహాసభల కో కన్వీనర్ సుదర్శన్ షారోన్ మూడో సందేశం అందిస్తూ దైవ సన్నిధి చేసి దైవ ప్రసన్నత అందరూ పొందాలన్నారు. మహాసభల కన్వీనర్ ఏజే షారోన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ విభేదాలు, వివాదాలు మాని సహనంతో మెలగాలన్నారు. మూడో రోజు భక్తులకు మధ్యాహ్నం భోజనంగా వెజిటెబుల్ బిర్యానీని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అందజేశారన్నారు. మార్టిన్, అగస్టస్, విజయరాజ్, జీవరత్నం, లావేటి సుదర్శనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాకొద్దు

బిక్కవోలు: చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం మాకొద్దు అంటూ కాపవరం గ్రామస్తులు స్పష్టం చేశారు. ఆ గ్రామంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను నిరసిస్తూ గ్రామస్తులు చేసిన తీర్మానం కాపీలను గురువారం తహసీల్దార్ బి.కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు అందించినట్లు కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకట రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి చెత్తను తీసుకువచ్చి, మా గ్రామంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. ఈ విషయంలో గ్రామస్తులందరం ఒకే మాట మీద ఉన్నామన్నారు. ఈ నెల 10వ తేదీన కాపవరంలో గ్రామ సభ ఏర్పాటు చేస్తే, అక్కడి టెంట్లు, కుర్చీలను అధికారులు, పోలీసులు బలవంతంగా తీసివేయించారన్నారు. అయితే గ్రామ సభ తీర్మానం ద్వారా ఆమోదించి మండల అధికారులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే కాపీలను జిల్లా అధికారులకు కూడా ఇస్తున్నామని తెలిపారు. కాపవరం గ్రామాన్ని కాపాడుకునేందుకు ప్రజలతో కలిసి ఎంతటి ఉద్యమం చేయడానికి అయినా వెనకాడేది లేదన్నారు. కార్యక్రమంలోని ఎంపీటీ మారెళ్ల భీష్ముడు పాల్గొన్నారు.

బెంచీ తీయమంటే.. మెట్లు తొలగించారు



బిక్కవోలులో అక్రమ్ బాషా ఇంటి మెట్లకు అడ్డుగా పెట్టిన బెంచీ



బెంచీతో పాటు మెట్లను కూడా తొలగిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా గుమ్మానికి అడ్డుగా పెట్టిన సిమెంట్ బెంచీని తొలగించాలంటూ అధికారులకు మొరపెట్టుకుంటే.. ఏకపక్షంగా బెంచీతో పాటు ఇంటి మెట్లను కూడా తొలగించారు. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. బిక్కవోలు కొత్తపేటలో నివాసం ఉంటున్న అక్రమ్ బాషా ఇంటి ముందు ఇద్దరు పాస్టర్లు, కొంత మంది వ్యక్తులతో కలిసి గత నెల 15వ తేదీన సిమెంట్ బెంచీని అడ్డంగా పెట్టారు. దాన్ని తొలగించాలంటూ బాషా స్థానిక అధికారులతో పాటు కలెక్టర్, జిల్లా ఎస్పీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే బుధవారం సాయంత్రం ఆకస్మికంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి తన సిబ్బందితో బెంచీని తొలగించారు. దాని వెనుక ఉన్న మెట్లను కూడా తొలగిస్తుండగా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా విచారణ కూడా చేయకుండా స్థానికులు ఫిర్యాదు చేశారంటూ ఇంట్లోకి వెళ్లే మెట్లను తొలగించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రోజాను వివరణ కోరగా. .ఇరు వర్గాల ఫిర్యాదును పరిశీలించిన తర్వాత సమస్య పరిష్కారం కోసం సిమెంట్ బెంచీ, మెట్లను తొలగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతానగరం: ముగ్గళ్ల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రఘుదేవపురానికి చెందిన ఎం.కృష్ణ చైతన్య హైదరాబాద్‌లో ఉంటున్నారు. సొంత గ్రామానికి వచ్చిన ఆయన పని మీద రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తూ ముగ్గళ్ల వద్ద రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చైతన్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.